

ఫీజుల మోత

- ప్రైవేటు పాఠశాలల్లో అడ్డగోలుగా వసూళ్లు
- తల్లిదండ్రులపై చదువుల భారం
- విద్యాహక్కు చట్టానికి తూట్లు
- ఆందోళనలో మధ్య తరగతి ప్రజలు

ఆసిఫాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా అడ్డగోలుగా వసూలు చేసే ఫీజులు భయ పెడుతున్నాయి. వేలకు వేలు డొనేషన్లు, పుస్తకాలు, పెన్నులు, నోట్ బుక్‌లు, టైలు అంటూ ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. జిల్లాలో ప్రైవేటు స్కూళ్లలో స్థాయిని బట్టి విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. నర్సరీ, ఎల్‌కేజీకి రూ.8 వేల నుంచి రూ10 వేలు, యూకేజీకి రూ.10 వేల నుంచి రూ12 వేలు, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ15వేల నుంచి రూ18వేలు,6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు:18వేల నుంచి రూ20వేలు,9, 10 తరగ తులకు రూ.22,000 నుంచి రూ.25,000 ఫీజులను వసూలు చేస్తున్నారు. దీంతో పాటు స్కూల్ వ్యాన్ ఫీజు అదనంగా వసూలు చేస్తున్నారు.

మెరుగైన విద్య కోసం..

తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల కన్నా మెరుగైన విద్యను అందించాలనే తపనతో ఉండే తల్లిదండ్రుల ఆశలను ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు స్కూళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇష్టారాజ్యంగా పాఠశాలలు ఏర్పాటు చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అయిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాలతో పాటు పోటీ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని చూపిస్తూ ప్రచార కార్యక్రమాలను శ్రీకారం చుట్టి విస్తృత ప్రచారం చేపడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, దుస్తులతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు యజమాన్యాలు తగిన వ్యూహంతో సాగుతున్నాయి. గత ఏడాది కన్నా ఈ ఏడాది ఫీజులు మరింత పెంచారు.

నియంత్రణ లేక..

ప్రైవేటు పాఠశాలలపై ఫీజుల నియంత్రణ లేక పోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు దండుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 110కి పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల విద్యాప్రమాణాలు, ఇతర వసతులను బట్టి ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో పాటు యూనిఫాం దుస్తులు, పుస్తకాలు, షూస్, టై, బెల్టులలో పాటు స్కూల్ వ్యాన్ ఫీజు అదనంగా వసూలు చేస్తున్నారు. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ప్రభుత్వం ప్రకటించినా ఎక్కడా పని చేసిన దాఖలాలు లేవు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం జీవో 91ని జారీ చేసినా జిల్లాలో అమలుకు నోచుకోవడంలేదు.

పద్నాలుగేళ్ల లోపు విద్యార్థులకు..

పద్నాలుగేళ్ల లోపు విద్యాలందరికీ ఉచిత విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ప్రైవేటు పాఠశాలల్లోనూ పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించాలని నిర్దేశించింది. 25 శాతం సీట్లు ఎలాంటి ఫీజు వసూలు చేయకుండా ప్రవేశం కల్పించాలి. ప్రవేశాలన్నీ లాటరీ పద్ధతిని నిర్వహించాలి. ఎనిమిదో తరగతి పూర్తైన విద్యార్థులకు ప్రాథమిక విద్య పూర్తైనట్లు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. ప్రభుత్వ గుర్తింపు లేకుండా ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటు చేయకూడదు. అర్హత కలిగిన ఉపాధ్యాయులనే నియమించాలి. పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలి.

కానీ జిల్లాలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఏ పాఠశాలలో కేటాయించడం లేదు. ఎక్కడా లాటరీ పద్ధతిన ప్రవేశాలు లేవు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగానే రుసుము వసూలు చేస్తున్నా అడిగే వారే లేరు. పాఠశాల అభివృద్ధి, సంక్షేమం, క్రీడలు, పరీక్ష రుసుము, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యజమాన్యాలతో కలిసి పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ సూచన మేరకు ఫీజులు వసూలు చేయాల్సి ఉన్నా అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో అన్ని వసతులతో ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో రూ.8 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు వసూలు చేయాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. దీంతో పాటు జిల్లాలోని అధిక శాతం ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు లేవు. బీఎడ్, డీఎస్ శిక్షణ పొందిన ఉపాధ్యాయులనే పాఠశాలల్లో నియమించాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు నియంత్రించాలి..
చిరంజీవి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను అధికారులు నియంత్రించాలి. ఏటేటా ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా అందించాల్సిన విద్య ఎక్కడా అమలు చేయడం లేదు. ప్రభుత్వ ఆమోదం లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఐదేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 0-5 ఏళ్లలోపు వయసు గల పిల్లల ఆధార్ నమోదు చేయించాలన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంఓలని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం విద్యా, గిరిజన సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, బ్యాంకు, తపాలా, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రీజియన్ యూఐడీ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సౌబన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జడ్పీ సీఈవో లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కోర్టు భవన సముదా యంలో శనివారం జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కోర్టుల పరిధిలో కుటుంబ, సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, ఎన్ఐ యాక్టు ఇతర అన్ని కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూత్ సభ్యులు

కెరమెరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఝరి ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని మైనార్టీ యూత్ అసోసియేషన్ నాయకుడు రిజ్వాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈవో ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిజ్వాన్ మాట్లాడుతూ పాఠశాలలో 125 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉందని కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారన్నారు. మరో ముగ్గురిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు యూసుఫ్, ఇసాచావుస్, రిషాన్, ముసా, నిసార్, రజాక్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

సిర్పూర్(యు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు. మండలంలోని పాములవాడలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటు భూ సమస్యలు పరిష్కరించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. రైతులు రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్ సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, మాజీ సర్పంచ్ పెందొర్ నాగోరావు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబోలి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భు భారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఆడ బీర్షావ్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ మోహన్, సర్వేయర్ శ్రీనివాస్, గ్రామకార్యదర్శి రాజకుమార్, మాజీ సర్పంచ్ మేస్రాం నాగోరావ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి



మేస్రాం జంగు(ఫైల్)

జైనూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబోలి గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు మేస్రాం జంగు(45) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మేస్రాం జంగు మండలంలోని దుబ్బగూడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడమెత విశ్వనాథ్‌రావు తదితరులు పరామర్శించారు.

అస్వస్థతకు గురై ఉపాధి కూలీ..

బెజ్జూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురై నాగులవాయి గ్రామానికి చెందిన కొట్రంగి పాపక్క(54) అనే ఉపాధి హామీ కూలీ మృతి చెందింది. గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికులు బెజ్జూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

పదేళ్ల అనంతరం తెరుచుకున్న పాఠశాల



విద్యార్థులతో ఎంఈవో రాథోడ్ సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం గొల్లగూడలో పదేళ్లుగా మూతపడిన పాఠశాలను ఎంఈవో రాథోడ్ సుభాష్ శుక్రవారం తెరిపించారు. పదేళ్లుగా పాఠశాల మూసి ఉందన్న సమాచారం తెలుసుకున్న ఎంఈవో రాథోడ్ సుభాష్ గ్రామానికి వెళ్లి అక్కడ పరిస్థితిని గ్రామ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు పాఠశాలకు రాకపోవడంతో పాఠశాలను మూసి వేశారని చెప్పారు. అప్పటి వరకు పని చేసిన ఉపాధ్యాయురాలు మౌనికను పిల్లలు లేకపోవడంతో రౌతు సంకెటపల్లిలోరి ఆర్‌ఆర్‌కాలనీ పాఠశాలను డిప్యూటేషన్‌పై పంపిం చారు. ఎంఈవో పూర్తి వివరాలు తెసుకుని మౌనికను అక్కడే పని చేయాలని సూచించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇక్కడ కొనసాగుతుందని, ఎనిమిది విద్యార్థులు చేరారని అధికారులు తెలిపారు.

విద్యార్థినులకు అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్ జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడంతో శుక్రవారం ప్రిన్సిపాల్ రత్నాబాయి వారిని అభినందించారు. గత నెల 25న నేపాల్ వెళ్లిన విద్యార్థినులు 27న ఎవరెస్ట్ శిఖరంకు బయలుదేరారు.. బీసీ గురుకులాల సొసైటీ రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబాబాద్, నిజామాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 20 మంది విద్యార్థులు బయలుదేరారు. ఇందులో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినులు హిమబిందు, బిక్కుబాయి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని బూర్గుడ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ స్థాయి అక్షరాభ్యాస కార్యక్రమా నికి హాజరై నూతనంగా చేరిన విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతి రోజు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలలకు పంపించాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌పుస్తకాలు, ఏకరూప దుస్తులు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పోషకాహార విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులు ఎస్ఎల్ఎన్ పద్ధతిన బోధన అందుతుందని తెలిపారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సమకూర్చిన బ్యాగ్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో ఆర్డనేటర్ శ్రీనివాస్, ఎంఈవో సుభాష్, ప్రధానోపాధ్యా యుడు సదాశివ్ పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో శివచరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అర్జుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నటరాజ్, ధర్మబాయి, సీఆర్పీ సందీప్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, ఊష, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జగదీష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): బడిబాటలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టినట్లు ఎంఈవో ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పర్దాన్‌గూడ గిరిజన ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాములు, ఎస్‌సీఈఆర్పీ వెంకటేశ్వరు పాల్గొన్నారు.



చిన్నారులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



వాంకిడిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో శివచరణ్‌కుమార్



బెజ్జూరులో అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

జైనూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి శుక్రవారం నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగ కండా పనులు వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాల న్నారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్, మాజీ సర్పంచ్ కుంర శాంరావ్, గ్రామ కార్యదర్శి మనోజ్, కారోబారి బండ శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆల్బర్ట్ అన్నారు. శుక్రవారం మండలంలోని లోడ్‌పల్లి గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. కొండపల్లి, ఎల్కపల్లి గ్రామాల్లో ఇంటి నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. పంచాయతీ తనిఖీలో భాగంగా గ్రామంలో రోడ్లు, నర్సరీలను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కార్యదర్శులు శ్రీకాంత్, శ్రీధర్, చంద్రశేఖర్, సీసీ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

ఆసిఫాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 2025-26 విద్యా సంవత్సరానికి గరిష్ఠంగా ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమాన్ తెలిపారు. శుక్రవారం డీఈవో కార్యాలయంల సూపరింటెండెంట్ రమణాచారికి ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రకాష్‌గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జాతీయ కార్యచరణ ప్రణాళికా పథకం కింద జిల్లాలో డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అర్హత, అనుభవం కలిగిన స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా అదనపు సంక్షేమాధికారి అడెపు భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని దరఖాస్తును జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దహెగాం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కమ్మర్‌పల్లి, దహెగాం గ్రామాల్లోని బాధితులకు శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు శుక్రవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన గురిజాల రాజబాబు అనారోగ్యానికి గురి కావడంతో రూ.12 వేలు కమ్మర్‌పల్లికి చెందిన అరవింద్‌కు రూ.13 వేలు మంజూరు కావడంతో చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, ధనుంజయ్, సంజీవ్, బాపు, మల్లేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బస్ పాస్ చార్జీల పెంపు సరికాదు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బస్ పాస్ చార్జీల పెంపు సరికాదని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ధరల పెంపుతో విద్యార్థులపై అధిక భారం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కాగజ్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా కో ఇన్‌చార్జి మంత్రి మల్లేష్ తెలిపారు. డాడానగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల పోరాటంతో వర్గీకరణ సాధ్యమైందన్నారు.. అనంతరం ఎమ్మార్పీఎస్ డాడానగర్ మండల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎడ్ల రాము, అధికార ప్రతినిధి శ్యాం, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా కన్నూరి సాయికుమార్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సుగుణ, అధికార ప్రతినిధిగా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సంధ్య, ఉపాధ్యక్షురాలిగా సౌభాగ్య, కోశాధికారిగా అన్నమ్మ ఎన్నికయ్యారు.

కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



సిర్పూర్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారి యాదగిరి

కాగజ్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియేట్ బోర్డు అధికారి యాదగిరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు పాటుపడాలని సూచించారు.. కళాశాలలో నెలకొన్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఇంటర్మీడియేట్ జిల్లా విద్యాధికారి కళ్యాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెరిగేలా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారి యాదగిరి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు అడ్మిషన్ అయిన విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎక్కువ మొత్తంలో అడ్మిషన్లు అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఈవో కల్యాణి, ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు ఆసీఫ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారి యాదగిరి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రవేశాలు, హాజరు శాతం సౌకర్యాలపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామదాసును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రాందాస్, అధ్యాపకులు చంద్రయ్య, కిరణ్‌కుమార్, సంతోష్, శ్రీధర్, తిరుపతి, సురేందర్‌కుమార్, జాకీర్, అర్చన తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మంచిర్యాలక్రైం, జూన్13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గోపాలవాడకు చెందిన అంజి రెడ్డి ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జూన్ 1న అశోక్‌రోడ్డులో పని నిమిత్తం వెళ్లగా ఒక్కసారిగా బీపీ తగ్గి పడిపోయాడు. స్థానికులు ఆసుపత్రి చేర్పించారు. తిరిగి సాయంకాలం వాహనాన్ని చూడగా వాహనం కనిపించ లేదు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుమల అన్నారు. రెబ్బెన మండలం నక్కలగూడలో మహిళలకు, బాలికలకు, జిల్లా భరోసా టీం ద్వారా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుమల మాట్లాడుతూ జిల్లా ఎస్పీఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. ఈవ్‌టీజింగ్ చేస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. అలాగే బ్యాంకు వివరాలు కూడా ఎవరికి తెలుపరాదన్నారు. బ్యాంకు పేరిట ఫోన్ చేస్తే ఎలాంటి సమాచారం కూడా ఇవ్వకూడదని సూచించారు. సైబర్ క్రైంకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తే న్యాయం చేసేందుకు అవకాశం ఉంటుందని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో లీగల్ సపోర్ట్ పర్సన్ శైలజ, కౌన్సిలర్ జీవిత, ఎఎన్ఎం విజయలక్ష్మి గ్రామస్థులు పాల్గొన్నారు.

మినరల్ దోపిడీ



- యథేచ్ఛగా నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మినరల్ వాటర్ పేరుతో శుద్ధి చేయని నీటిని క్యాన్లలో నింపి ప్రజలకు అంటగడుతున్నారు. ఇవి ఫిల్టర్ చేసినవని భావించి ప్రజలు సైతం కొనుగోలు చేస్తున్నారు. ఆ నీరు తాగితే పిల్లలు, పెద్దలకు మోకాళ్ల నొప్పులు, ఎముకల సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో నీటి డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. దీన్ని అనుకూలంగా మార్చుకున్న వ్యాపారులు లాభాల వేటలో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. నీటిని ప్యూరి ఫై చేసే పేరుతో దందా కొనసాగిస్తున్నప్పటికీ ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని చెబుతున్నారు.

● వాల్టా చట్టం ప్రకారం

వాల్టా చట్టం ప్రకారం బోరు వేసేందుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అటు రెవెన్యూ, ఇటు మున్సిపాలిటీ నుంచి నోఆబ్జెక్షన్ సర్టిఫికెట్స్ తీసుకోవాలి. వీటితో పాటు ఆహారభద్రత, కాలుష్య నియంత్రణ మండలి, గ్రాపంచాయతీ అనుమతి పొందాలి. కానీ ఏవేమి పట్టించుకోకుండానే వాటర్‌ప్లాంట్లను ఏర్పాటుచేసి శుద్ధ జలం పేరిట అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఒక్క నీటి ప్లాంటు ఏర్పాటుచేసి వ్యాపారం చేస్తున్నట్లు చెబుతున్నారు. పలు కాలనీల్లో ఉన్న ఆర్వో ప్లాంట్ల యజమాన్యం ఫిల్టర్ చేయకుండానే నీటిని క్యాన్లలో నింపి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారనే వాదనలున్నాయి. 20లీటర్ల క్యాన్లతో పాటు కూలింగ్ క్యాన్లను సైతం పలు కేంద్రాల్లో శుభ్రపరచకుండానే వినియోగించడం వల్ల నాచు పేరుకుపోతోంది. కొన్ని కేంద్రాల్లోనైతే అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. నిబంధనల ప్రకారం 180 రోజులు వినియోగించిన తర్వాత తిరిగి ఆ క్యాన్లను వాడ కూడదు. క్యాన్ల అడుగు భాగంలో నాచు పేరుకు పోతోంది. పట్టణ స్థాయిలో మున్సిపల్, మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు అనుమతి, పరిశీలన, తనిఖీలు, పర్యవేక్షణ తదితర విషయాలు చూడాల్సి ఉన్న పట్టించుకోవడం లేదనే విమర్శలు న్నాయి. తనిఖీలు చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు మామూలుగా విడిచిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు మినరల్ పేరుతో కలుషిత నీటిని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● అనుమతులు లేకుండానే..

అనుమతులు లేకుండానే తాగు నీటిని శుద్ధిచేసే ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అయినా కూడా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రజలకు ఇష్టారాజ్యంగా నీటిని సరఫరా చేస్తూ ప్రజలప్రాణాలతో వ్యాపారులు చెలగాటం ఆడుతున్నారు. ప్లాంట్ల నిర్వాహకులు కోట్లాది రూపాయల దందాచేస్తూ నాణ్యత ప్రమాణాలు ఏమాత్ర పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పట్టణంలో సుమారు 10కి పైగా ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వీటి వద్ద రేయింబవళ్లు బోరు నుంచి నీటిని తోడుతు న్నారు. దీంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. తాగునీటి బావులతో పాటు బోర్లను ఇష్టారాజ్యంగా వేసి ఆర్వో ప్లాంట్లకు వాడుతున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం పరీక్షలు చేయించి శుద్ధ జలాన్ని విక్రయించాలి. కానీ అవి ఏవీ పాటించడం లేదని చెబుతున్నారు.

బైక్‌ల చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

మంచిర్యాలక్రైం, జూన్13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల బైక్‌ల చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ద్విచక్రవాహనం చోరీ కేసులో మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన బొల్లి ప్రవీణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12న హమాలీవాడకు చెందిన కుడుదుల శ్రీను స్కూటిని తన ఇంటి ముందు పార్కు చేయగా చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా బొల్లి ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకిపాల్పడినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. ముఖరాం చౌరస్తాలో ద్విచక్రవాహనం చోరీ చేసిన కేసులో గుండేటి రాకేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్ రావు తెలిపారు. ఈ నెల 11న ముఖరాం చౌరస్తాలో భరత్‌రెడ్డి పార్కింగ్ చేసిన వాహనాన్ని దొంగలించార ని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు. పాత నేరస్తులను విచారణ చేయగా గుండేటి రాకేశ్ వద్ద వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాం డ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీ కొని ఒకరి మృతి

వాంకిడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ద్విచక్ర వాహనం ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదం లో మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గేడెం సోనేరావు(30) అనే యువకుడు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో మహారాష్ట్ర వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం (టీఎస్ 20సీ 0104) వేగంగా ఢీకొట్టింది. దీంతో సోనేరావు తలకు, కాలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. మండల కేంద్రంలోని బనార్ కోసార గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనారుడు కొమురం మల్కుకు సైతం తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్ లో ఆసిఫాబాద్ ప్రభుత్వ తరలించారు. సోనేరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొమురం మల్కు పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు తరలించారు. సోనేరావు తమ్ముడు సూరజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బడిబాటను విజయవంతం చేయాలి

రెబ్బెన, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బడిబాటను విజయవంతం చేయాలని రెబ్బెన ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రేకులగూడలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడీడు పిల్లలను తల్లిదం డ్రులు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలను, యూనిఫాంలను అందజేస్తున్నట్టు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. విద్యార్థులు తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ రావు, పురుషోత్తం పాల్గొన్నారు. నవేగాంలో ప్రధానోపాధ్యాయుడు సదానందం ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులు పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ్, సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

కాగజ్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బడీడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లిలోని స్కూల్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఐదేళ్లు నిండిన పిల్లలను తప్పకుండా బడిలో చేర్పించాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సమయం కాగానే విద్యార్థులకు నోట్ బుక్‌లు, వర్క్‌పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందించిన స్వయం సహాయక సంఘాల కృషి ఎంతో అభినందనీయమన్నారు. సమాజంలో ఏదైనా సాధించాలంటే విద్యతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అంశాలపై బోధన జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేం దుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను, యూనిఫాంలు, అడ్మిషన్ ఫారాలను అందజేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి మధూకర్, తహసీల్దార్ మధూకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంఈవో వాసాల ప్రభాకర్, ఏకౌంట్ అధికారి దేవాజీ, ప్రధానోపాధ్యాయులు అనురాధ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదేనని, విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆదర్శ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసి సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి హాజరై సరస్వతిదేవి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు గల భవనాలు ఉన్నాయని, అన్ని అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 1,500 మంది ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కా్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, ఎంసీఏవో ఉద్ధవ్, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, జీసీడీవో శకుంతల, ప్రధానోపాధ్యాయులు, నాయకులు శ్యాంరావు, అరిగెల నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని జలపాతాలను అభివృద్ధి చేయాలి

ఆసిఫాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జలపాతాలు, పర్యాటక కేంద్రాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్‌తివారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాలో జలపాతాలు, పర్యాటక కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లయితే పర్యాట కులు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందన్నారు, కార్యక్రమంలో నాయకులు టీకా నంద్, కార్తీక్, శ్రావణి పాల్గొన్నారు.

ఎస్టీపీపీకి గ్రీన్ టెక్ ఫౌండేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి

జైపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని ఎస్టీపీపీకి గ్రీన్ టెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన 24వ గ్లోబల్ గ్రీన్ టెక్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టెనబిలిటి అవార్డు లభించినట్లు జీఎం శ్రీనివాసులు అన్నారు. న్యూ ఢిల్లీలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ అవార్డుతో కలిపి పవర్ ప్లాంట్ సాధించిన అవార్డుల సంఖ్య 50కి చేరిందన్నారు. సింగేణి పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం జరిగిందని పేర్కొన్నారు. కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా ఎస్టీపీపీ ఆవరణలో ప్లాంటేషన్ చేపట్టామని, ఎఫ్‌జీడీ ప్లాంట్ నిర్మాణ చేపడుతున్నామని, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి మిథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని త్వరలోనే వీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కాలుష్యాన్ని అరికట్టడం కోసం ఉపయోగిస్తున్న సాంకేతికతక, వాడుతున్న పరికరాలు, తీసుకుంటున్న చర్యలకు ఈ అవార్డు లభించిందన్నారు. ఈ అవార్డు రావడం పట్ల సింగరేణి సీఎం డీ ఎన్ బలరాం, డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు ఉద్యోగులను అభినందించినట్లు తెలిపారు. అవార్డును గ్రీన్‌టెక్ ఫౌండేషన్ చైర్మన్, సీఈవో కమలేశ్వర్ చరణ్ చేతుల మీదుగా ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం వాసుదేవ మూర్తిలు అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉట్నూర్ గ్రామీణ స్వయం ఉపాధి శిణ సంస్థ కేబీ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 18-45 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు. మగ్గం వర్క్, హౌస్ వైరింగ్, బ్యూటీ పార్లర్, సెల్‌ఫోన్ రిపేరింగ్, టూ వీలర్ రిపేరింగ్, ఫొటోగ్రఫీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజ నం, బస్సు చార్జీలు, టూల్ కిట్స్, ధ్రుపపత్రం అందజే స్తామని తెలిపారు. ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



లాభాల వాటా ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటా ప్రకటించడంతో పాటు 35 శాతం చెల్లించాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పర్వతి రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు ప్రకటించకపోవడం సరైంది కాదన్నారు. వెంటనే లాభాల వాటా ప్రకటించి చెల్లిస్తే కార్మికుల పిల్లల ఫీజులు, ఇతర అవసరాలకు ఉపయోగపడతాయని తెలిపారు. సమావేశంలో నాయకులు రామస్వామి, గట్టయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సులభ్ కార్మికుల సమ్మె వాయిదా

శ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సులభ్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16 నిర్వహించనున్న సమ్మెను వాయిదా వేసినట్లు సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ డి. బ్రహ్మానందం, రాష్ట్ర అధ్యక్షుడు రాసుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి సంజీవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సింగరేణి పక్షాన డీజీఎం(పర్సనల్) అజయ్ కుమార్, డిప్యూటీ ఎస్ఈ(సివిల్) ప్రవీణ్‌కుమార్, యూనియన్ నాయకులు హైదరాబాద్‌లోని సహాయ లేబర్ కమిషనర్ కార్యాలయంలో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా తిరిగి ఈ నెల 16న మరో సమావేశం ఏర్పాటు చేస్తామని, సమస్యలు పరిష్క రిస్తామని సింగరేణి అధికారులు హామీ ఇచ్చారని, ఈ కారణంగా సమ్మెను వాయిదా వేస్తున్నామని తెలిపారు.

సింగరేణిలో పెరుగుతున్న విజిలెన్స్ వేధింపులు

» ఆధారాలు లేకున్నా కార్మికులపై చర్యలు » అధిక శాతం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులే బాధితులు

మందమర్రి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో విజిలెన్స్ వేధింపులు రోజు రోజుకు పెరిగిపోత న్నాయి. దీంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. నచ్చని కార్మికులపై గుర్తు తెలియని వ్యక్తులు ఉత్తరాలు రాస్తే ఆధారాలు లేకపోయినా సదరు విజిలెన్స్ అధికారులు చర్యలకు పూనుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీ కార్మికులే అధికంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. కార్మికులు నివాసం ఉంటున్న ప్రాంతంలో ప్రైవేటు వ్యక్తులు గొడవలు పడితే కార్మికుడే చేస్తున్నాడని విజిలెన్స్‌కు రాస్తే వెంటనే పనిచేస్తున్న చోటుకు వచ్చి ఆరా తీయడం పరిపాటిగా మారింది. ఇటీవల ఎస్టీపీపీలో విజిలెన్స్ కారణంగా ఆత్మహత్య చేసుకోవడంతో ఓ కుటుంబం రోడ్డున పడింది. కార్మికులు ఏమైనా వ్యతిరేకంగా ప ని చేస్తే మొదట హెచ్చరించడం, చార్జి షీట్ లాంటి సంఘటనలు ఇవ్వడం ఉండేది. పిలిచి మందలించిన సందర్భాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో వీటికి భిన్నంగా విజిలెన్స్ అధికారులు వ్యవహరించడం కార్మికులు, వారి కుటుంబాలు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో కొంతమంది కార్మికులకు 13 సంవత్సరాల తర్వాత వస్తే ఇక నుంచి తప్పు చేయమని రాయించుకొని ఇతర ఏరియా లకు బదిలీ చేశారు. దీంతో ఆ కార్మికులు పనిష్మెంట్‌గా భావించి పని చేశారని, కాని 13 సంవత్సరాల తర్వాత బయటకు తీసి ఇంక్రిమెంట్లలో కోత విధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చేయని తప్పుకు శిక్ష ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నా యాజమాన్యం పట్టించు కోవడం లేదు. సింగరేణిలో ఇప్పటి వరకు 350 మందికి పైగా విజిలెన్స్ వేధింపులతో బాధపడుతు న్నారు. చాలా మందికి ఇంక్రిమెంట్లలో కోత విధించినట్లు తెలుస్తుంది. దీని వల్ల కార్మికులు దిగిపోయినప్పుడు నష్టపోయే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా కార్మిక సంఘాలు మాత్రం నోరు మెదపడం లేదని ఆరోపిస్తున్నారు. త్వరలో సీఎండీని కలిసి వారి బాధను తెలుపేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవేళ తప్పులు చేసి ఉంటే ఆధారాలతో నిరూపించి సస్పెండ్, లేదా చార్జిషీట్ ఇవ్వాలని, ఇంక్రిమెంట్లు నిలుపుదల పద్ధతిని మానుకోవాలని బాధితులు స్పష్టం చేస్తున్నారు.

ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు..

- జనక్‌ప్రసాద్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్



సింగరేణిలో విజిలెన్స్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. కార్మికులు కష్టపడి కంపెనీ లాభాల దిశగా నడిపిస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఒకవేళ కార్మికులుపని చేస్తే తప్పుగా భావించి వారికి చార్జిషీట్ ఇవ్వాలి. ఈ చర్యలను సహించం. త్వరలో సీఎండీని కలిసి మాట్లాడతాం. ఈ మధ్య కాలంలో విజిలెన్స్ అత్యుత్సాహం సంస్థకు తీరని నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.

తప్పులు చేస్తే చార్జిషీట్ ఇవ్వాలి

- తుమ్మల రాజిరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు



కార్మికులు తప్పులు చేస్తే చార్జిషీట్ ఇవ్వాలి. ఇంక్రిమెంట్ కోత విధించడం సరికాదు. సింగరేణిలో అనేక కుంభకోణాలు జరిగాయి. దానిలో పెద్ద స్థాయి అధి కారుల పాత్ర ఉంది. విజిలెన్స్ అధికారులు ఆ కుంభకోణాల బాధ్యులైన అధికారులపై చర్యలుతీసుకున్నారా. కార్మికులపై చర్యలు సరికాదు.

సింగరేణిలో విజిలెన్స్ అత్యుత్సాహం

- రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు



విజిలెన్స్ వారు అత్యుత్సాహం చూపుతున్నారు. విజిలెన్స్‌లో పని చేస్తున్న వారు సింగరేణిలో అనేక కుంభకోణాలు జరిగితే బాధ్యులపై ఎక్కడ కూడా చర్యలు తీసుకో లేదు. సింగరేణిలో పని చేస్తూ ఇతర సంస్థలో పని చేస్తూ వేతనాలు పొందితే దానిపై ఆధారాలు చూపాలి.నష్టం చేకూరుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

పీఎఫ్ ఏరియర్స్ సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అధికారులు 11వ వేజ్‌బోర్డుకు చెందిన సీఎంపీఎఫ్ ఏరియర్స్, రివైజ్డ్ పెన్షన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారామయ్య కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచౌరీని కలిసి పలు సమస్యల గురించి చర్చించారు. రివైజ్డ్ పెన్షన్‌కు సంబంధించి 33 వేల మందికి పరిష్కారం చూపామని, ఇంకా 1400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నెల రోజుల్లోగా వాటికి పరిష్కారం చూపుతామని కమీషనర్ హామీ ఇచ్చారు. అలాగే పెరిగిన పెన్షన్ కోసం 326 మంది వివరాలను ఎస్‌బీఐ ధన్‌బాద్ బ్యాంకుకు పంపామని ఆయన పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ రుణాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రక్తదానం అభినందనీయం

శ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యువ కార్మికులు రక్తదానం చేయడం అభినం దనీయమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ వృత్తి శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఆర్‌కే 8 డిస్పెన్సరీలో రక్తదానం చేశారు. వారికి జీఎం ప్రశంసాపత్రాలు అందించి మాట్లాడారు. అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదన్నారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా, కిడ్నీ, కేన్సర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, ప్రభుత్వ ఆస్పత్రిలోని నిరుపేదలకు అత్యవసర సమయాల్లో అందించనున్నట్లు పేర్కొన్నారు. యువ కార్మికులు రక్తదానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు సామాజిక సేవలో ముందంజలో ఉందన్నారు. కార్యక్ర మంలో ఎంవీటీసీ కమ్రుద్దీన్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ డాక్టర్ రమేష్ బాబు, ఏటీఓ రామరావు, జూనియర్ మైనింగ్ అధికారి రాజ్‌కుమార్, ఆర్‌కే 8 డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, సింగరేణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం

శ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పీ 1 గనిలో కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, అండర్‌గ్రౌండ్‌లో కలుషిత నీరు ఉండడంతో వాటిని తాగిన కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. డిస్ట్రిక్ట్‌లో వెంటిలేషన్ లేదని, ట్రాక్‌లైన్ సక్రమంగా లేవని అన్నారు. కార్యక్రమంలో జీఎం చర్చల ప్రతినిధి చంద్రమోహన్, పిట్ కార్యదర్శులు రాజయ్య, లచ్చన్న, సహాయ పిట్ కార్యదర్శి పరశురాం, ఉపాధ్యక్షడు అనంతరెడ్డి, షిఫ్ట్ కార్యదర్శి వంశీ, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అందరికీ అందుతున్నాయి..

తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మూడు నెలల కోటా ఒకేసారి అందించడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?

తహసీల్దార్ : ఎలాంటి ఇబ్బందులు లేవు. మండలంలో 10 రేషన్ షాపుల ద్వారా మూడు నెలల రేషన్‌లో భాగంగా సన్న బియ్యం ఒకేసారి ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో లబ్ధిదారుల సంఖ్య...?

తహసీల్దార్ : మండలంలో 10,127 రేషన్ కార్డులు ఉన్నాయి. గతంలో నెల వారి రేషన్‌లో కొందరు రేషన్ తీసుకునే వారు కాదు. కాని మూడు నెలల రేషన్ ఒకే సారి ఇవ్వడంతో లబ్ధిదారులు రేషన్ షాపు వద్ద బారులు తీరుతున్నారు.

ఆంధ్రజ్యోతి : మూడు నెలల కోట ఎంత మొత్తంలో ఉంటుంది ?

తహసీల్దార్ : మండలంలో అన్ని రేషన్ షాపులు కలిపి 589 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీకి ఏర్పాటు చేశాము. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయి కోటా పంపిణీ జరుగుతుంది అనే సమాచారం వుంది.

ఆంధ్రజ్యోతి : భూభారతి రెవెన్యూ సదస్సుల పరిస్థితి ఏంటి...?

తహసీల్దార్ : రెవెన్యూ సదస్సులో భాగంగా మండల వ్యాప్తంగా మంగళవారం వరకు 227 దరఖాస్తులు వచ్చాయి. వారి ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియ జరుగుతుంది.

-హాజీపూర్, (ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో ఎంపీవో పర్యటన

తాండూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండల పంచాయతీ అధికారి శుక్రవారం కిష్టంపేట, రాజీవ్‌నగర్ గ్రామ పంచాయతీలను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉదయ్, రాంప్రసాద్, రమాదేవి ఉన్నారు.

రక్తం ఇద్దాం..

ప్రాణాలు కాపాడుదాం



- రక్తదానంపై అవగాహన అవసరం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా రక్తం లభ్యత అనేది రోజు రోజుకూ పెనుభూతంలా మారి సామాజిక సమస్యగా పరిణమిస్తోంది. రోడ్డు ప్రమాదాలు, కేన్సర్ చికిత్సలు, తలసేమియా చికిత్స, ప్రసవ సమయం, ఇలా పలు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది. దశాబ్దకాలంగా రక్తదానం గురించి అవగాహన పెరిగినప్పటికీ రక్తనిల్వలు సరిపడా ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యకరమైన ప్రతివ్యక్తి స్వచ్ఛందంగా రక్తదాతగా మారడం మాత్రమే దీనికి పరిష్కారం. ఈ విషయంలో అవగాహన కలిగిస్తూ పలువురికి స్ఫూర్తి నిస్తున్నారు పలువురు నగర వాసులు.

● జిల్లా కేంద్రంలో విస్తృతమైన సేవలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ద్వారా 2008 డిసెంబరు 8న రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ రక్తనిధి కేంద్రం ద్వారా తలసేమియా రోగులకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణులకు రక్తాన్ని అందిస్తున్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేస్తున్నారు. దీంతో రక్తం కొరత లేకుండా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రక్తం నిల్వలు తక్కువ ఉన్నప్పుడు సింగరేణి, రెవెన్యూ రాజకీయ, పోలీసులు, అధికారులకు రక్త దాన శిబిరాలను నిర్వహించాలని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వినతిపత్రాలు అందిస్తున్నారు. వారు శిబిరాలను నిర్వహించి సహకరిస్తుండడంతో రక్తం నిల్వలు రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో అందుబాటులో ఉంటున్నాయి.



రక్తదాతలకు ప్రశంసా పత్రం అందిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

● రక్తనిధి కేంద్రంలో నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి నేతృత్వంలో 1290 రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి 1,04,800 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఇందులో 53,995 యూనిట్లను ఉచితంగా దానం చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వరకు ఓపాజిటివ్ 12 యూనిట్లు, ఓ నెగిటివ్ 5 యూనిట్లు, ఏ పాజిటివ్ 7 యూనిట్లు, ఏ నెగిటివ్ 1 యూనిట్, బి పాజిటివ్ 5, బీ నెగిటివ్ 1, ఏబీ పాజిటివ్ 1, ఏబీ నెగిటివ్ 1, మొత్తం 33 యూనిట్ల రక్తం అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● నేపథ్యం

రక్తదాతల గుర్తుగా ప్రతియేటా జూన్ 14న రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. రక్తదానం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, రక్తదాతల సేవలను గుర్తించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. 2000 సంవత్సరంలో మంచి రక్తం నాతోనే ప్రారంభిస్తాను అనే నినాదంతో ప్రముఖ నోబెల్ అవార్డు గ్రహీత స్కార్‌లాండ్ స్టేనర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన కనిపెట్టిన ఏ, బీ, ఓ అనే రక్తం గ్రూపుల గుర్తుగా రక్తదాన దినోత్సవాన్ని జరుపుకుంటారు.

● రక్తదానం ఎవరు చేయొచ్చు..

ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న వారు రక్తదానం చేయవచ్చు. 168 సార్లు జీవిత కాలంలో రక్తదానం చేయవచ్చు. బీపీ, షుగర్ ఉన్నవారు రక్తదానం చేయకూడదు. ఒకసారి రక్తదానం చేసిన తర్వాత మహిళలు అయితే 6 నెలలు, పురుషులు అయితే 3 నెలల తర్వాత మళ్లీ రక్తదానం చేయవచ్చు.

సేవల్లో ముందుంటాను

మధుసూదన్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి



జిల్లాలో కొన్నేళ్ల నుంచి 48 సార్లు రక్తదానం చేశాను. ఇప్పటి వరకు స్వచ్ఛందంగా అత్యధికంగా రక్తదానం చేసినందుకు రాష్ట్ర గవర్నర్, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నాను. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. రక్తదానంపై ప్రభుత్వం కల్పిస్తున్న కార్యక్రమాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి. రక్తదాతలకు ఉచిత ప్రమాద బీమా పాలసీలు కూడా ప్రభుత్వం అందిస్తుంది. జీవిత కాలంలో ఎన్నిసార్లు అయినా రక్తదానం చేయవచ్చు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

మంత్రి వర్యా.. మీపైనే ఆశలు

(5వ పేజీ తరువాయి)

నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్వరగా పనులను పూర్తి చేసి ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో పాటు నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోక సమీకృత కూరగాయల మార్కెట్ చెన్నూరు నడిఒడ్డున దర్శనమిస్తోంది. ఇందులో సరైన సదుపాయాలు లేవని మార్కెట్‌ను తరలించడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. వెంటనే మంత్రి దృష్టి పెట్టి సదుపాయాలు కల్పించి సమీకృత భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది. లేదంటే అది అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారనుందనే అభిప్రాయాలు వినబడుతున్నాయి.

● నిత్యం ట్రాఫిక్ రద్దీ

పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుంచి కోటపల్లి బస్టాండ్ రాగిచెట్టు వరకు ప్రతీ రోజు, ప్రతి గంటకు ట్రాఫిక్‌తో వాహనదారులు, బాటసారులు, విద్యార్థులు ఇబ్బందుల పాలవుతూనే ఉన్నారు. ఇకనైనా ఇరుకైన రోడ్డులో ఒక్క భారీ వాహనం లేక రెండు బస్సులు ఎదురెదురుగావస్తే గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు ఏర్పాటు చేసిన బైపాస్ రహదారి ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి దీనిపై దృష్టి పెట్టి బైపాస్ రోడ్డును అందుబాటులోకి తెస్తే సమస్యకు పరిష్కారం దొరకనుంది.

● అటవీ శాఖ అనుమతులు వస్తే

మారుమూల మండలాల్లోని గ్రామాల్లో అటవీ శాఖ అనుమతులు లేక పలు రహదారుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దీంతో గ్రామాలకు బస్సులు లేక ప్రజలు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. చెన్నూరు-భీమారం ప్రధాన రహదారిలోని జోడు వాగుల వద్ద సైతం అటవీ శాఖ అనుమతి లేదని రహదారి వెడల్పు పనులు నిలిచిపోయాయి. అటవీ శాఖ అనుమతులు వస్తే రోడ్డు నిర్మాణం వేగిరం కానుంది. అలాగే పోడు సాగుపై నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు దాడులు దౌర్జన్యాలు ఏదో ఒక చోట జరుగుతున్నాయి. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులపై అటవీ శాఖ అధికారులు దాడులు చేస్తున్నారనే చెడ్డ పేరు ఈ ప్రభుత్వానికి ఉంది. దీనిపై మంత్రి దృష్టి పెడితే సమస్య పరిష్కారం అవుతుంది. ఇంకా పలు చోట్ల రోడ్లు, రహదారుల నిర్మాణాలతో పాటు వాగులపై వంతెనలు చేపట్టాల్సి ఉంది. ఇన్ని సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న చెన్నూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలోకి తీసుకువెళ్లేందుకు మంత్రిపైనే కోటి ఆశలు పెట్టుకున్నారు.

మంత్రి పేరిట ఆలయంలో పూజలు



మంత్రి కుటుంబీకుల పేరిట అర్చన చేయిస్తున్న బండి సదానందం యాదవ్

మందమర్రిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఆయన కుటుంబీకుల పేరిట శుక్రవారం మండలంలోని జగదాంబేశ్వర ఆలయంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ ప్రత్యేక పూజలు చేయించి అర్చనలు చేయించారు. మంత్రి పదవి వచ్చిన సందర్భంగా 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి మంత్రి మంజూరు చేసిన బోర్‌వెల్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. సదానందం యాదవ్ మాట్లాడుతూ మంత్రి పదవి రావడంతో చెన్నూరు నియోజకవర్గం, మంచిర్యాల జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిస్వార్థమైన సేవకు కాకా కుటుంబం నిదర్శనం

మందమర్రిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దివంగత కాకా వెంకటస్వామి కుటుంబం నిస్వార్థంగా ప్రజా సేవకు అంకితమై పనిచేస్తున్నారని, విశాఖ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పైడిమల్ల నర్సింగ్, పుల్లూరి లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పార్టీ అధిష్టానం, సీఎం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. 15 నెలల కాలంలో నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్, జావేద్‌ఖాన్, నర్సయ్య, గందె రాంచందర్, కొమురయ్య, విజయ్, గణేష్, ఎర్ర రాజు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

భీమిని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరకులు పంపిణీ జరిగేలా చూడాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రేషన్ షాపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌకధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని పారదర్శకత, జవాబుదారీతనంగా ఉండాలని సూచించారు. మూడు నెలల సరకులు ఒకే సారి ఇవ్వడంతో జనాలకు అసౌకర్యం కలగకుండా ప్రతీ కుటుంబానికి సన్నబియ్యం అందేలా చూడాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో రైతువేదికలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలో ప్రజల దరఖాస్తులు స్వీకరించారు. గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోవర్ధన్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీదేవి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతితో భూసమస్యలు దూరం

దండేపల్లి జూన్ 13 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం తీసుకవచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలు దూరమవుతాయని తహసీల్దార్ రోహత్ దేశపాండే సూచించారు. దండేపల్లి మండలం ముత్యంపేట, చింతపల్లిలోని శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ముత్యంపేటలో 20, చింతపల్లిలో 24 భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, ఆర్ఐ భూమన్న, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాండూర్ : ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి ప్రవేశపెట్టిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంపలపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మండల తహసీల్దార్ జ్యోత్స్నతో కలిసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జన్నారం, జూన్13 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో ధర్మరాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పొన్కల్ గ్రామ పంచాయతీలో నర్సరీలను పరిశీలించారు. మొక్కలు నాటే సమయానికి కల్ల పూర్తిస్థాయిలో మొక్కలు అందుబాటులో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం పొన్కల్ గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఈవో రాహుల్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

ఇందారంలో ఉచిత మెగా వైద్య శిబిరం

జైపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందారం గ్రామంలో కరీంనగర్ సన్‌రైజ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సూపర్ సన్ రైజ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గుండె, మెదడు, వెన్నుపాము, మోకాలు, తుంటి మార్పిడి, ఊపిరితిత్తులకు అన్ని రకాలఅత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్యాంపు మేనేజర్ రాజేందర్, క్యాంపు కో ఆర్డినేటర్ సతీష్, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ గోగు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశం, శ్రీనివాస్, తయాబ్ పాల్గొన్నారు.

జూలై 9 న భారత్ బంద్‌కు పిలుపు

భీమిని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ మోదీ ప్రభుత్వం రైతులకు వ్యవసాయాన్ని భారంగా మార్చే విధానాల అమలుకు వ్యతిరేకంగా జూలై 9 భారత్ బందు పిలుపు నిచ్చినట్లు ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు సంకె రవి పిలుపు నిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కలిస్తూ చట్టం చేయడం లేదన్నారు. కార్పోరేట్ సంస్థలకు 16 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు రద్దు చేసి ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలను తగ్గిస్తూ రైతులపై భారం మోపిందన్నారు. కేవీపీఎస్ జిల్లా నాయకులు గుమాస అశోక్, ముంజం ఆనంద్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

దండేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలోని దూర ప్రాంతం నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థుల కోసం లింగాపూర్ మోడల్ స్కూల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం మంచిర్యాల ఆర్టీసి డిపో సూపరింటెంట్ రాజబాబుకు ఉపాధ్యాయులు వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు జయకృష్ణారెడ్డి, అమీర్ పాషాలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

డీఈవో యాదయ్య

లక్షెట్టిపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఈఏడాది పాఠశాలలో చేరిన చిన్నారులకు ప్రత్యేకంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరయ్యారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల పునఃప్రారంభం కంటే ముందు నుంచి గ్రామాల్లో పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఎంఈవో శైలజ, సెక్టోరియల్ ఆఫీసర్ చౌదరి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, విజయ, రాణి, అంగన్‌వాడీ శంకరమ్మ, పాల్గొన్నారు.

దండేపల్లి : ప్రభుత్వ బడి...అమ్మ ఒడి లాంటిదని, ద్వారక స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చిన్న నరసయ్య అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా గుడిరేవు, దుబ్బగూడ ఎల్, మామిడిపల్లి దోరగారిపల్లిలో ప్రభుత్వ ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో

భీమారం : భీమారంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేరిన 1వ తరగతి విద్యార్థులతో ఎంఈవో గోపాల్‌రావు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు రావాలని, విద్యను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సదాలక్ష్మీ, ఉపాధ్యాయులు కుమార్, పరిమళ, తల్లిదండ్రులు పఆల్గొన్నారు.

హాజీపూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బాబాసాగర్, కర్నమామిడి, పడ్తన్‌పల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎంపీపీఎస్ కొత్తపల్లిలో పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్డు ప్రారంభించారు. ఎంఈవో తిరుపతిరెడ్డి, మండల నోడల్ అధికారి అనుమాండ్లు, ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ సరకులు ఎక్కడైనా తీసుకోవచ్చు

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన అధికారులు

భీమిని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పల్లెలో రేషన్ కష్టాలు అనే కథనానికి జిల్లా పౌరసరఫరా అధికారులు శుక్రవారం స్పందించారు. రేషన్ దుకాణాలు సమీపంలో ఉంటే రేషన్ సరకులు పొందవచ్చని లబ్దిదారులకు సూచించారు. గ్రామంలో 500 కార్డులు ఉంటే ఆయా గ్రామాల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డుల దారులందరికీ సరకులు సకాలంలో పంపిణీ చేస్తామని తెలిపారు. పోర్టబిలిటీ ద్వారా కార్డు దారుడు తనకు సమీపంలో ఉన్న షాప్‌లలో రేషన్ సరకులు పొందవచ్చని తెలిపారు. నిర్ధారిత, నిర్దిష్ట ప్రతిపాదనలను ఆయా మండలాల్లో తహసీల్దార్ ద్వారా వచ్చిన వాటిని పరిశీలించి కమిషనర్ ఉత్తర్వుల కోసం నివేదించబడుతుందన్నారు.

చలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయండి

కాసిపేట, జూన్13 (ఆంధ్రజ్యోతి): వృత్తిదారులకు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈనెల 17న హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని వృత్తిదారుల సంఘం జిల్లాగౌరవ అధ్యక్షులు దావనపల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన వృత్తిదారులందరికీ పెన్షన్ పథకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయి బ్రాహ్మణులకు కరెంటు బిల్లులు తగ్గించాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కారానికి ఈనెల 17న హైదరాబాద్‌లో ధర్నా చేపట్టామన్నారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. నాయీబ్రాహ్మణులు శ్రీనివాస్, తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఒకే దరఖాస్తు..120 మంది బాధితులు

50 ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్య ● పరిష్కారం చూపాలని భూభారతిలో వినతి

కోటపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వాయిపేట గ్రామ రైతుల బాధ అంతా ఇంతా కాదు. భూమి సాగులో వారున్నా పట్టాలు వారి పేర్లపై లేకపోవడంతో 50 ఏళ్లుగా భూ సమస్య పరిష్కారం కోసం తిరగని చోటు లేదు. సుమారు 200 ఎకరాల భూమిలో 120 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. అనుభవ దారులుగా ఉన్నా పట్టాలు లేకపోవడంతో వారికి రుణాలు కానీ, రైతు బీమా కానీ అందడం లేదు. దీంతో శుక్రవారం ఈ గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామ సభలో తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు 120 మంది రైతులు తమ సమస్య పరిష్కరించాలని కోరుతూ సంతకాలతో కూడిన ఒకే దరఖాస్తు అందించారు. ప్రస్తుత కలెక్టర్, ఆర్డీవోలకు ఈ సమస్యపై స్పష్టమైన అవగాహన ఉన్నందున తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బాధిత రైతులు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

కాసిపేట, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. బుగ్గగూడెం పంచాయతీలో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు కింద 117 ఇళ్లు మంజూరు కాగా పెద్దనపల్లి, కాసిపేట, కోనూరు పంచాయతీల్లో సోమవారం పంపిణీ చేయనున్నారు. శుక్రవారం పలు పంచాయతీల్లో పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శ్రీరాంపూర్ : నస్పూర్‌లోని మనోరంజన్ సముదాయాన్ని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగుల సౌకర్యాలం కల్పించే సదుపాయాలను ఆయన పరిశీలించారు. డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి ఎస్ఈ(సివిల్) సత్యనారాయణ పాల్గొన్నారు.

దండేపల్లి: జూన్ 5 నాటికి పట్టాదారు పాసు పుస్తకం వచ్చిన రైతులు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని దండేపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి గొర్ల అంజీత్‌కుమార్ కోరారు.

కాసిపేట: కొండాపూర్ 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్ సబ్‌స్టేషన్ ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఏర్పడుతుంది.

ఎస్టీపీపీలో కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు అధికారుల పర్యటన

జైపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు అధికారులు శుక్రవారం పర్యటించారు. ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు పుష్పగుచ్ఛాలు అందించి వారికి స్వాగతం పలికారు. శ్రీరాంపూర్ ఏరియాలోని పవర్ ప్లాంట్, గనుల తీరును అధ్యయనం చేయడానికి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్టీపీపీ అధికారులు శివప్రసాద్, మదన్ మోహన్, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నస్పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని తీగల్‌పహాడ్ గోదాముల వద్ద లారీ డ్రైవర్లకు, ఓనర్లకు రోడ్డు భద్రతపై పాటించాల్సిన రక్షణ సూత్రాలను శుక్రవారం ఎస్ఐ ఉపేందర్‌రావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

జన్నారం, జూన్13 (ఆంధ్రజ్యోతి): జన్నారం అంగన్‌వాడీ కేంద్రం-3లో శుక్రవారం గర్భిణులకు, పిల్లలకు మెనూ పాటించాలని డిడబ్ల్యూవో రవూఫ్‌ఖాన్ తెలిపారు. అదే విధంగా మూడు సంవత్సరాలు దాటిన పిల్లలకు అక్షరాభ్యసంతో పాటు ఆటపాటలు నేర్పించే అవగాహనలో పాల్గొన్నారు. సీడీపీవో రేష్మ, పంచాయతీ సెక్రటరీ శ్రీపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
శనివారం 14 జూన్ 2025





రక్తం ఇద్దాం.. ప్రాణాలు కాపాడుదాం 7

- రక్తదానంపై అవగాహన అవసరం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



మినరల్ పేరిట దోపిడీ

- యథేచ్ఛగా నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు 6
- పట్టించుకోని అధికారులు

నేడు జిల్లాకు మంత్రి రాక

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నికైన గనులు, కార్మికశాఖ మంత్రి గడ్డంవివేక్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ఇందారం మీదుగా రసూల్ పల్లె, జైపూర్, భీమారం, చెన్నూరు, రామ కృష్ణపూర్, మందమర్రి ప్రాంతాల్లో పర్య టించనున్నారు.

చెన్నూరు : మంత్రి వివేక్‌వెంకట స్వామి శనివారం చెన్నూరు నియోజకవ ర్గంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నా యకులు తెలిపారు. నాయకులు, కార్యక ర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

మందమర్రిటౌన్: రాష్ట్ర కార్మిక , ఉ పాధి కల్పన, గనులశాఖ మంత్రిగా పద వీ బాధ్యతలు చేపట్టిన వివేక్‌వెంకట స్వామి శనివారం నియోజకవర్గానికి వ స్తున్న సందర్భంగా నాయకులు ఆయ న కు ఘనంగా స్వాగతం పలికేందుకు ఏ ర్పాట్లు చేశారు. జాతీయ రహదారితో పా టు కోల్‌బెల్ట్ రోడ్డు వరకు పార్టీ జెం డాలు, మంత్రి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశా రు. మార్కెట్‌లో ఆశీర్వాద సభకు ఏర్పా ట్లు చేశారు. బీ1క్యాంపు కార్యాల యం వద్ద పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలను కట్టారు.

ఏసీబీ డీఎస్పీగా మధు



నస్పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అవినీతి నిరోధక శా ఖ ఆదిలాబాద్ రేంజ్ డీఎస్పీగా జి. మధు శుక్రవారం నస్పూర్ పట్టణంలోని ఏసీబీ కార్యాలయంలో బా ధ్యతలు స్వీకరించా రు. అంతకు ముందు ఇక్కడ డీఎస్పీగా పని చేసిన పి. విజయ్ కుమార్ కరీం నగర్ రేంజ్‌కు బదిలీపై వెళ్లారు.

జీసీసీ మేనేజర్ సస్పెన్షన్

జన్నారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీ సీసీ మేనేజర్ సస్పెన్షన్‌చేస్తూ ఆదిలాబా ద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా ఆదేశాలు జారీ చేశారు. గతంలో మేనేజర్ బాలాజీ వేమనపల్లిలో పని చే స్తుండగా విధుల పట్ల నిర్లక్ష్యం వహిం చడమే కాకుండా అక్రమాలకు పాల్పడ్డా రన్న అభియోగంపై సస్పెన్షన్ చేసినట్లు తెలుస్తుంది.

మంత్రివర్యా.. మీ పైనే ఆశలు



- నియోజకవర్గంలో ఏళ్లుగా వెంటాడుతున్న సమస్యలు
- మంత్రిపైనే ప్రజల ఆశలు
- నేడు చెన్నూరుకు మంత్రి వివేక్ రాక

చెన్నూరు పట్టణంలోని ఇరుకైన ప్రధాన రహదారి

చెన్నూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గంలో సమస్యలు వెంటాడుతున్నాయి. నూతనంగా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న గడ్డం వివేక్ వెంకటస్వామి అయినా సమస్యల పరిష్కారం దిశగా నడుస్తారా అన్న ఆశతో స్థానిక ప్రజలున్నారు. కార్మిక, మైనింగ్‌శాఖలు చేపట్టిన గడ్డం వివేక్ మంత్రి హోదాలో నేడు తొలిసారి చెన్నూరుకు రానున్నారు. ఇరుకిరుకు రహదారులు, అసంపూర్తి డ్రైనేజీలు, తాగునీటికి తిప్పలు, మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు ఇలా ఎన్నో సమస్యలు మంత్రికి సవాళ్లుగా నిలవనున్నాయి.

తలాపునే గోదావరి ఉన్నా అన్నదాతకు కన్నీరే..

నియోజకవర్గం చుట్టూ తలాపున గోదావరి, ప్రాణహిత నదులు ప్రవహిస్తున్నా అటు సాగునీరు, ఇటు తాగునీరు అందని దుస్థితి నెలకొంది. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో పంటల సాగుకు మండలంలోని సుందరసాల, నర్సక్కపేట, సోమనపల్లి, కోటపల్లి మండలంలోని కొల్లూరు, అర్జునగుట్ట, సిర్సా, జనగామ గ్రామాల సరిహద్దుల్లో గోదావరి, ప్రాణహిత నదులకు అనుసంధానంగా ఎత్తిపోతల ప్రాజెక్టులు నిర్మించి తాగునీరు అందించారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు జరగడంతో ఎత్తిపోతల పథకాలు మూలకు పడ్డాయి. ఇదిలా ఉంటే ప్రాజెక్టు పగుళ్ల తేలడంతో కాళేశ్వరం, అన్నారం, సుందిల్ల బ్యారేజీలను మూసివేశారు. దీంతో గోదావరి అంతా చుక్క నీరు లేకుండా పోయింది. అటు కోట్లాది రూపాయలు వెచ్చించిన ఎత్తిపోతల పథకాలు మూలకు పడడం, ఇటు బ్యారేజీలు మూత పడడంతో సాగు నీటికి, తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. తాగునీరందించే మిషన్ భగీరథ నీరు సైతం నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు రాకపోవడంతో తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తాయి.

పత్తాలేని ఆర్టీసీ డిపో.. రెవెన్యూ డివిజన్

చెన్నూరులో ఆర్టీసీ బస్ డిపో కలగానే మిగిలిపోయింది. డిపో నిర్మాణానికి భూమి కేటాయించి పనులు ప్రారంభమైనా సదరు స్థలం తమదేనంటూ కొందరు కోర్టుకు వెళ్లడంతో పనులకు ఆదిలోనే ఆటంకాలు ఏర్పడ్డాయి. దీనిపై మంత్రి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు సైతం కాగితాలకే పరిమితమైంది. చెన్నూరులో రెవె న్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల మండలాల రైతులకు లబ్ధి చేకూరేది.

● అందని మెరుగైన వైద్యం

ఆసుపత్రిలో ఇటు వైద్యుల కొరత, అటు సిబ్బంది కొరతతో సకాలంలో సరైన వైద్యం అందడం లేదని విమర్శలు ఉన్నాయి. మూడు మండలాల గ్రామాలకు చె న్నూరే ప్రధాన కేంద్రం కావడం, గ్రామాల నుంచి రో గులకు సర్కారు వైద్యం అందక ప్రైవేటు వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. దీనిపై మంత్రి దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని గ్రామీణులు కోరుతున్నారు. అలాగే మరో వైపు నిర్మాణంలో ఉన్న వంద పడ కల ఆసుపత్రి ...(తరువాయి 7లో)

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మంత్రి



పీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్/చెన్నూర్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను శుక్రవారం రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి హైద్రాబాద్‌లోని గాంధీ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. మంత్రిని కూడా పార్టీ అధ్యక్షుడు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం వారిద్దరు సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే దృష్టి సారిస్తామని మంత్రి తెలిపారు. మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించినం దుకు కూడా మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్



వైద్య శిబిరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

నస్పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆయుష్మాన్ భారత్ మిషన్, భారత్ అభియాన్, ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ కోరారు. నస్పూర్ పట్టణంలోని సంఘ మల్లెయ్య పల్లెలో శుక్రవారం క్షయవ్యాధి నివారణ ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వ హించారు. క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరంలో నస్పూర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేశ్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సిహెచ్‌వోలు రమేశ్, వెంకటేశ్వర్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ఎంఎల్‌హెచ్‌పి ప్రవళిక, క్షయవ్యాధి జిల్లా కోఆర్డినేటర్ సురేందర్, హెచ్ఐవి సూపర్‌వైజర్ రాజేశ్, ఎస్‌టీఎస్ సాయిరెడ్డి, మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి

● ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, జూన్13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఆగమశాస్త్ర పండితుల సలహాలతో ఆలయం అభివృద్ధి చేస్తానని అన్నారు. మార్కెట్‌రోడ్డులో రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని పూర్తిచేసి నగరాన్ని సుందరీ కరణంగా తీర్చిదిద్దుతానన్నారు. లక్ష్మీ టాకీస్ నుంచి రంగపేట వరకు వెళ్లే ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు మాతాశిశు ఆసుపత్రి పనులు ఇది వరకు చేపట్టామన్నారు. ఆరునెలల్లో పూర్తి చేస్తామన్నారు. నాయకులు పట్టణ అధ్యక్షులు పూదరి నరేశ్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.


ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

● జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత

లక్సెట్టిపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతుల ఆయిల్‌ఫామ్ సాగుచేస్తే అ ధిక లాభాలు పొందవచ్చు అని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత అన్నారు. శుక్రవారం లక్సెట్టిపేట మండలంలోని రంగపేట, హన్మంత్‌పల్లి గ్రామాల్లోని జీపీ కార్యాలయాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పాం సాగుపై కూడా దృష్టి సారించాలని దీంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు వీలు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఉద్యానవన అధికారి కందుల సహజ, పంచాయతీ సెక్రటరీ మాధవి పాల్గొన్నారు.

అర్హులకే మార్కెట్‌లో షెటర్లు కేటాయించాలి

బెల్లంపల్లి, జూన్13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ సెటర్లు అర్హులకే కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం వ్యాపారస్తులు వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లోని సెటర్లను అక్రమంగా అనర్హులకు కేటా యించారని పేర్కొన్నారు. అనర్హులకు కేటాయించడంతో ఎంతో మంది వ్యాపారస్తులు వీధినపడ్డారన్నారు. ఈ విషయంపై వెంటనే విచారణ చేపట్టి అనర్హులను తొలగించి అర్హులకు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి, మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారస్తులు

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

● మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్సెట్టిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మా ణం పనుల్లో వేగం పెంచాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 30పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులను గురువారం ఎమ్మెల్యే నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు ఇప్పటికే చివరి దశకు చేరాయని వచ్చే నెలలో అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పనుల్లో జాప్యం చేసిన పనులపట్ల నిర్లక్ష్యం వహించిన సహించేది లేదన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మారు తీప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నాగభూషణం పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

హాజీపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గుడిపేట గ్రామంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ఏఈ మహేందర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎక్కడెక్కడ విద్యుత్ సమస్యలు ఉన్నాయో అన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను నమోదు చేసుకున్నారు. శనివారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దంపేట, దొనబండ, హాజీపూర్, కర్ణ మామిడి, టికానపల్లి, పడ్తన్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

కుల బాంధవుల అభివృద్ధికి కృషి

మందమర్రిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న మందమర్రి పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని బత్తుల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నానని తెలిపారు. పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణ పూర్తి చేయిస్తానని తెలిపారు. కుల బాంధవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వచ్చే సంక్షేమ పథకాల గురించి మంత్రి వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేయాలి

మందమర్రిరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేయాలని డీపీఎం స్వర్ణలత సూచించారు. మండలంలోని పొదుపు సంఘాలకు కొత్తగా ఎన్నికైన ఓబీలకు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను , యూనిట్లను వినియోగించుకుని పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గ్రామాల్లో అవసరం ఉన్న యూనిట్లను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ ఐబీ ప్రకాష్‌గౌడ్, ఏపీఎం లలితకుమారి, ఆడిటర్ రాజం, సీసీలు మోహన్,చారి, సునీత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

● కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అనుభ వజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇందారం, టేకుమట్ల, కిష్టాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. హాజరు పట్టికలు, రిజిష్టర్‌లు, తరగతి గదులను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. నూతన మెను ప్రకారం పిల్లలకు పోషక విలువగల ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ చూపించాలన్నారు. టేకుమట్ల, కిష్టాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు.

ఈ నెల 20 వరకు సదస్సులు ఉంటాయన్నారు. ఎస్ఐ శ్రీధర్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

భీమారం : వివిధ రకాల సమస్యల పరిష్కారం, ధృవపత్రాల జారీ కోసం వచ్చే అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం భీమారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులకు సంబంధించి రికార్డులను సరి చూసి క్షేత్రస్థాయిలో విచారించి సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సదానందం, అధికారులు ఉన్నారు.



టేకుమట్ల పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నాణ్యమైన వస్తువులను అందించాలి



సరుకులను పరిశీలిస్తున్న చైర్మన్ కొట్నాక తిరుపతి

జన్నారం, జూన్13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన వస్తువులనే అందించాలని జీసీసీ ఛైర్మన్ తిరుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీసీసీ విక్రయవికేంద్రాన్ని సందర్శించారు. గిరిజన హాస్టల్లకు అందించే సరుకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హాస్టల్లకు నాణ్యమైన వస్తువులు అందించాలని విద్యార్థులకు పరిపూర్ణమైన మెనూ అందాలని అన్నారు. ఆదివాసీ గిరిజన విద్యార్థులు అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. ఆయన వెంట ఉట్నూర్ జీసీసీ డివిజనల్ మేనేజర్ సందీప్‌కుమార్, స్థానిక మేనేజర్ బాలాజీ, సిబ్బంది రాజ్‌కుమార్, ప్రభాకర్, అస్తమల్లేశ్, ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఆధార్‌కార్డు కలిగి ఉండాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరు ఆధార్‌కార్డు కలిగి ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో యుఐడీ అసిస్టెంట్ మేనేజర్ మహ్మద్‌శౌబన్, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ఏసీపీ ప్రకాష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆధార్‌కార్డు కలిగి ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్ కార్డు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు.. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్య, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, సునీల్ పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

జిల్లాలోని నిరక్షరాస్యులైన ప్రతి ఒక్కర్ని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15ఏళ్ల పైబడిన లక్షా 20వేల మంది నిరక్షరాస్యులను గుర్తించామని, మొదటి విడతలో భాగంగా 30,600మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ఎంపిక చేశామన్నారు. కాసిపేట మండలాన్ని ఎంపికచేసి వందశాతం అక్షరాస్యత మండలంగా మార్చామన్నారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన జిల్లా ఖేలో ఇండియా బాక్సింగ్ క్రీడా కారులను కలెక్టర్ కుమార్‌దీపక్ శుక్రవారం కార్యాలయంలో అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయస్థాయి బాక్సింగ్ జూనియర్ విభాగంలో 48 నుంచి 50కిలోల విభాగంలో ఉబైద్ ఖాన్, 50 నుంచి 52కిలోల విభాగంలో క్రితి అగర్వాల్‌లు వెండి పతకాలు సాధించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమ లో జిల్లా యువజన క్రీడాసేవలశాఖ అధికారి హన్మంత్‌రెడ్డి, బాక్సింగ్ శిక్షకుడు రాజేష్ పాల్గొన్నారు.